


భగవంతుని పేరెత్తేవారంటే నాకు మంటి. అతనివల్లే సృష్టి జరుగుతుందంటే నాకు కోపం....అతనంత పక్షపాతి మరెవరూ లేరు. కొందరికి కోరినవన్నీ యిస్తాడు. మరికొందరికి కనీసపు కోర్కెలు గగన కుసుమాలు చేస్తాడు. యెందుకు? యేమో ..

"ఇక్కడ నిల్చున్నావా తలంటుకోవూ?" ప్రశ్నించింది తల్లి . . . .నా కన్నతల్లి. నన్ను కన్నందుకు పదిసార్లు కించపడే తల్లి. ఇందాక అక్కయ్యకు ప్రేమగా తలంటిన మాతృమూర్తి.

"ఊం." అన్నాను. మర్నాడు సాయంత్రము మా వివాహాలు. స్నానాల గదివైపు వెళ్తూ హాల్లోకి చూచాను. సర్వాలంకారంతో ముసి, ముసిగా నవ్వుతుంది. అక్క చుట్టూచేరిన బంధుజనము హాస్యంతో పరిహాసాలతో ఆమెను ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నారు. నా హృదయం భగ్గుమంది. తొట్టెడు నీళ్లు నా హృదయంలోని మంటల నార్పలేక పోయాయి.

"ఇదిగో తుండు." పొడిగా తుండు

యిచ్చింది అమ్మ. అక్కయ్య, తల వీపు అప్యాయంగా తుడిచిన అమ్మ. అందు కున్నాను.

"శ్రీ లతకేం బంగారుబొమ్మ....మీ అత్తగారు చాలా నగలు కొన్నారట కదూ!"

"అయ్యో వెర్రిమాలోకమా! అత్త గారు కాదు. అతనే స్వయంగా అన్నీ కొనిపించాడట."

"అందం, అదృష్టం, ఐశ్వర్యం అన్నీ ఉన్నాయి"

వాళ్ళు మాట్లాడే మాటలు నా మండే గుండెలలో ఆజ్యం పోశాయి. మరోమాట వినాలని లేదు. అయినా అమ్మలక్కలు ఊరుకుంటారా!

"మీ జయలత అత్తగారేం కొన్నారు వదినా!"

"వారేం కొంటారు! అబ్బాయి ఏదో విశాల భావాలున్నవాడు కాబట్టి పెళ్లికి అంగీకరించాడు. కట్నం డబ్బే అడ్వా న్సుగా తీసుకువెళ్ళి తన చెల్లెలి పెళ్ళి చేశాడు."

"అంతేలే. ఒకరి అదృష్టం మరొకరికి యెలా వస్తుంది!"

"అమ్మాయి బాధ పడగలదని వాళ్ళ నాన్నే నాల్గు చీరలు, ఓ నెక్లెసుకొన్నారు. ఇది మా శ్రీకి భలేగా నప్పింది."

"శ్రీ....శ్రీ....శ్రీ!" నేలను కసిగా తన్నాను. అన్నీ శ్రీకే కురూపిగా పుట్టడం నాతప్పా! కన్నతల్లి ప్రతిక్షణం ఇద్దరిని కంపేర్ చేస్తుంటే యెలా వుంటుంది! నాకు కొన్న ముష్టి నెక్లెసు కూడా అక్కయ్యకే నప్పిందట.... కనీసం నాకో హృదయముందని ఎందుకు అనుకోరు. ఏడ్పు రావటం లేదు. సహ నము చచ్చిపోతుంది. అందరిపైనా కసి, ద్వేషం బయలుదేరాయి.

"జయలతా!.... కొత్తబట్టలు కట్టు కోవూ!" అమ్మ పిలుపు. అక్కయ్యలా నన్ను ముద్దుగా జయా అనో....లతా అనో పిలిస్తే, పిలువరు....ముద్దొచ్చేవారికి ముద్దుపేర్లు.

"చెముడా ఏమిటే!" అమ్మ గదిలోకి వచ్చింది.

"ఏమిటీ!" అన్నాను విసురుగా.

"కల్యాణ తిలకం పెట్టాలి. కొత్త బట్టలు కట్టుకుందువుగానిరా."

"నాకే తిలకం వద్దు. నా ముఖానికి అదొక్కటే తక్కువ అయింది."

"బావుందమ్మా నిష్ఠూరం! సమయ మవుతుంది పద" లాక్కెళ్ళినట్టు తీసుకు పోయింది. అందులో ఆప్యాయత, ఆద రణ ఏ కోశాన లేవు. తల్లి అంటే అమృతమూర్తి అంటారు. ఆమె హృద యమంతా నవనీతం అంటారు. ఏవీ! ... అమ్మ వాక్కులో అమృతం కనిపించదేం! కొంత నా వూహ కావచ్చు. మరికొంత చుట్టూ ఉన్నవారి ప్రవర్తన కావచ్చు. నేనో చట్రంలో బిగించుకుపోయాను. అవతలివారు ఏవి మాట్లాడినా నాకు తప్పు

గానే కన్పించేది. నా మనసెరిగిన పెద్దలు లేరు. వారికి నేనో బాధ్యతను, బరువును. ఆ భావన వారి ముఖాలలో చూచినప్పుడు నేను యెంత నరకయాతన అనుభవించే దాన్నో యెవరూ ఊహించలేరు. లాంఛన ప్రాయంగా ఓ చీర, జాకెట్టు యిచ్చింది. అవి తొడుక్కున్నాను.

"శ్రీలత ఒక్కతే ఉంది. జయ ఏది?" ఎవరిదా కంఠము! ఆశ్చర్యంగా బయటకు చూచాను. సుగుణమ్మ టీచర్. వెళ్ళి ఆమె పాదాలు కన్నీటితో అభిషేకించాలనుకున్నాను ఆమె సార్థక నామధేయురాలు. భౌతిక కాయం చూచి మాట్లాడే మనిషి కాదు అలా అని ఆమెను కురూపి అనుకునేరు. ఆమెలాటి అందమైనవారు ఆ ఊరిలోనే లేరంటే అతిశయోక్తి కాదు. నాకు ప్రేమాదరణకు అర్థం తెలిసింది ఆమె అమృతవాక్కుల వల్లే.

"భలేవారండీ! అమ్మాయి రానంటే గదిలో వదిలేస్తారా!" ఆవిడ చనువుగా నా గదిలోకి వచ్చింది.

"జయా!" ఆవిడను చూస్తూ నిల్చున్నాను. "ఈ చీర నీకు యెంత బావుంది! ఆ బొట్టు అలా అడ్డదిడ్డుగా పెట్టుకున్నావేం!" ఆవిడ బొట్టు సరిచేసింది. నాలో యెన్నో రోజులనుండి పేరుకుపోయిన ఆవేదన అశ్రురూపంలో బయటపడింది.

"ఛ.. తప్పమ్మా." చక, చకా తల చక్కగా దువ్వి, కబుర్లు చెబుతూ ముస్తాబు చేసింది. మా ఇద్దరికి ఒకే లాంటి బహుమతి ఇచ్చిందావిడ. ఇద్దరిని ఒక చోట కూర్చుండ బెట్టింది. ముత్తయిదువుల చేత పాటలు పాడించింది. హాస్యాలతో నవ్వులతో, కేరింతలతో గంట గడిచిందే తెలియదు. ఆవిడ నవ్వగలదు. నవ్వించ గలదు. ఆమె వెళ్ళి పోయాక మళ్ళీ ఏదో శూన్యం లాంటిది నా హృదయిం ఆవరించుకుంది. పరిస్థితులు, మామూలే.

"ఏడిదిలో అల్లుళ్ళను చూచామే. శ్రీకి భలే జోడి దొరికింది."

"అది పుట్టగానే మా యింట్లో దీపం వెలిగింది. పిచ్చిది.... వెళ్ళిపోతే యెలా ఉంటాము!" కంట తడిపెట్టుకుంది అమ్మ.

"ఏమేవ్!" నాన్నగారికేక.

"ఆ ...ఏమిటి?"

"శ్రీని కాస్త హాల్లోకి పంపు. పెళ్ళి కొడుకు స్నేహితులు చూస్తారట. అబ్బాయి వచ్చాడు."

"ఓయ్.... మీ ఆయనకెంత ఆరాటమే. అప్పుడేను ..."అందరి హాస్యాల మధ్య అక్క వయగారాలు పోతుంది, నా హృదయమున కుచించుకు పోయింది.

"జయలతకు ఆనెక్లెసు ఏం బావుందే!"

"మరింత వికారాన్ని కలుగ చేస్తుంది."

"ఆ సంగతి నాకు ముందే తెలుసు. వద్దంటే ఊర్కుంటుదా!"

అమ్మ వివరణ. ఆ క్షణంలో ప్రాణం

పోతే బావుండును అనిపించింది.

అక్క వివాహం అవుతున్నా బయటికి రాలేదు. నేను బయిటికి రాకపోయినా నాత్మీయమూర్తులు నన్ను తూర్పార పట్టటం మీరలేదు. పాము, తేలు మొదలగు జంతువులు నయం, వాటి జోలికి పోయి, వాటిని తొక్కితేనే కాటు వేస్తాయి కాని ఈ మనుష్యులు మనింట్లో మనముణ్నా, నిర్దాక్షిణ్యంగా హింసిస్తారు. పొడిగా నాకు పిలుపు వచ్చింది. మా శ్రీవారి తరపున బంధువులు యెవరూ అట్టే లేరు. బావగారి ముఖంలోని చిలిపితనం, ఉత్సాహం. మూవారిలో మచ్చుకైనా కన్పించ లేదు. ఏదో బాధ్యతగా మూడు ముళ్ళు వేశారు. పుమ్మల్ని గుమ్మం దగ్గర పేరు చెప్పమని యెవరూ పరిహాసాలు ఆడలేదు.

"జయలత చురుకయిన పిల్ల, చదివినంత వరకు చదివించండి. ఆమె అంత రంగం చూచి ప్రేమించే పురుషుడు తనంతటి తాను వచ్చిన్నాడు వివాహం చేసుకుంటుంది." సుగుణమ్మ టీచరు నాన్నతో చెప్పగా విన్నాను, అయినా నాన్న నాకోసం పెళ్ళి కొడుకును కొన్నారు.

మొదటిరాత్రి మధురమైన తొలిరేయి అంటారు. నాకెలాంటి అనుభూతులు లేవు. అతను తలనొప్పి అని పడుకున్నాడు, పది నిమిషాలు మౌనంగా దొర్లాయి.


"అమృతాంజనం రాయనా?" మెల్లగా అడిగాను. ఆ క్షణంనుండి అతను నావాడు. అతని బాగోగులు నాకు ముఖ్యం.

"వద్దు...." అన్నారు పొడిగా. కళ్ళు విప్పి నా వంక అయినా చూడలేదు. ఇలా యెందుకు జరిగింది! గంట, రెండు గంటలు గడిచాయి. అతనివైపునుండి... మాట లేదు. లైటు ఆర్పి అలాగే ఓ ప్రక్కకు ఒత్తిగిలి పడుకున్నాను.

మర్నాడు అక్కయ్య బయటే కన్పించలేదు. ఒక క్షణం బయటికి వచ్చినా, ఏవో సాకుతో బావ పిలిచేవాడు. మావారు ఇంట్లోనే కన్పించలేదు. కొందరు సానుభూతిగా నా వంక చూడటం భరింపలేకుండా ఉన్నాను. సాయంత్రం పెరట్లోకి వచ్చి కూర్చున్నాను. శూన్యంలోకి చూస్తున్నాను. కాలమే తెలియలేదు.

చీకటిపడ్డాక ఇంట్లోకి వచ్చాను. హాల్లో నవ్వులు వినిపించాయి. తొంగి చూచాను. నా హృదయస్పందన ఆగిపోయినట్టు అయింది. మావారు అంత బాగా నవ్వుతారని తెలియదు. అక్కయ్య, బావ ఆయన ముగ్గురు పేక ఆడుతున్నారు. అక్కయ్య ఏదో జోక్ చెబితే ఆయన పగలబడి నవ్వుతున్నారు. ముగ్గురిలో ఏ ఒక్కరికి నేనో మనిషిని ఉన్నానని తెలియదా, చెప్పలేని కోపంవచ్చింది. ఎవరిపైన తీర్చుకోవాలి!

"లైటు వేసుకోకుండా పడుకున్నావేం? భోజనం చేద్దువు రా." అమ్మ




పొడిగా పిలిచింది.

"ఆకలి లేదు." అలాంటి రోజులు చాలా గడిపాను, తెలివి వచ్చినప్పటి నుండి. గంట తరువాత ఆయన గదిలోకి వచ్చి బట్టలు మార్చుకుంటున్నారు.

"మేమందరం సినిమాకు వెడుతున్నాం. నువ్వు వస్తావా?" నువ్వు రా అంటే వెళ్ళేదాన్నేమో. ఎంత తేలిక!

"మీరు వెళ్ళిరండి." అంతే! ఆ మాట కెదురుచూస్తున్నట్టే ఆయన వెళ్ళిపోయారు. మలిరేయి సంబరం ఇలా ముగిసింది. మర్నాడు వారందరు షాపింగ్‌కు వెళ్ళారు. నా హృదయభారం తీరాలంటే.... ఒక అరగంట సుగుణమ్మ టీచర్ దగ్గరకెళ్ళాలి. వెళ్ళి ఆమె భుజంపై తలవాల్చి భోరుమన్నాను. నా నోటితో చెప్పకుండానే అంత అర్థం చేసుకుంది. ఎన్నో విధాలుగా ఓదార్చింది.

"స్త్రీ జీవితం ఓ శాపం జయా! అది వరంగా మార్చుకోవటం మన చేతిలో పని. పురుషుడు వెంటనే అభినందించేది బాహ్యసౌందర్యం. నువ్వు నీ ప్రేమ, అభిమానంతో ఆయనను ఆకట్టుకో.... నటించాలనుకో. తప్పదు మరి." ఎన్నో విషయాలు చెప్పి పంపించింది. ఆవిడ చెప్పిన విషయాలు మననము చేసుకుంటూ ఇంటిదారి పట్టాను. వాళ్ళంతా పేక ఆడుతున్నారు. బావగారు కాఫీ కావాలంటే అందరికి నేనే తీసుకుపోయి ఇచ్చాను. మధ్యాహ్నము వాళ్ళిద్దరూ స్నేహితులను చూచి రావటానికి వెళ్తే, మావారు హాయిగా నిదురపోయారు. రెండుగంటలనుండి అయిదు గంటల వరకు అలా కనిపెట్టుకుని కూర్చున్నాను. ఆయన లేవగానే కాఫీ తెచ్చిఇచ్చాను. కాఫీ త్రాగి వెళ్ళి హాల్లో నాన్నగారి దగ్గర

కూర్చున్నారు.

"పెద్దల్లుడు బెంగుళూరు, మద్రాసు తిరిగి వస్తాడట. మరి మీ ప్రోగ్రాము ఏమిటోయ్?"

"నాకు సెలవు లేదండీ. ఇల్లు చూచు కుని వచ్చి....తీసుకు వెడతాను." నాకు చెప్పలేనంత కోపం వచ్చింది. నా పేరు వుచ్చరించటానికి అంగీకరించని మనిషి నన్నెంత ప్రేమగా చూస్తాడో ఊహించ గలను. అయినా నిగ్రహించుకున్నాను.

పురుషుడి కామ వాంఛకు ఓస్త్రీ అవ సరము. అలాంటి అవసరాలకు పావు నయ్యానే గాని వారి హృదయంలో స్థానము సంపాదించ లేక పోయాను. నటించాలి. అతను వెళ్లటానికి సిద్ధం అయ్యాడు.

"ఏమండీ!" యెంతో ప్రేమగా చేరువగా వెళ్లాను.

"ఏమిటి?"

"మీ వెంట తీసుకు పోరూ!"

"ఎక్కడికి? నేనో స్నేహితునితో ఉంటాను."

"మళ్లీ యెప్పుడు వస్తారు?"

"ఎప్పుడు సెలవుదొరికితే అప్పుడు." బలవంతంగా కళ్లనీళ్లు అపుకుని వెళ్లి పోయాను.

* *

అక్కయ్య భర్తతో హనీమూన్ ట్రిప్పు పూర్తిచేసుకుని రావటం. అదే రోజు మావారు నన్ను తీసుకు పోవ టానికి ఒకేసారి తటస్థ పడ్డాయి. ఆయన నిదుర పోయాక జేబులోనుండి శంఖుల హారం క్రింద పడింది. నా సంబరం ఇంతా, అంతాకాదు. ఆయన నా గురించి ఆలోచిస్తా రనుకుంటే యెంతో గర్వంగా వుంది. ఆ హారం యధాస్థానంలో పెట్టే శాను. ఆయన చేత్తో యిస్తే యెంత హాయి! తెల్లవారిన దగ్గరనుండి ఆయన చుట్టే తిరుగుతున్నాను. ఆయన హారం సంగతి యెత్తనే లేదు.

"రేపు మనము వెళ్లిపోవాలి." అన్నారు పొడిగా. ఉత్సాహంగా కొత్త సంసారానికి కావల్సిన వస్తువులు సర్దు కుని, సాయంత్రం సుగుణమ్మ టీచరుకు చెప్పి రావటానికి వెళ్లాను. ఆవిడ ఇంటికి తాళం చూడగానే చెప్పలేని దిగులు వేసింది. హృదయ పూర్వకంగా ఆశీర్వ దించే వ్యక్తి. ఆవిడను చూడకుండా వెళ్ళటం పెద్ద అపశకునంగా భావించాను. నిరాశగా ఇంటిదారి పట్టాను.

అమ్మ వంట ఇంట్లో బిజీగా వుంది. అక్కయ్య గదిలోకి పోబోయి ఆగి పోయాను. మా వారికి అగదిలో ఏం పని?

"ఈ అవకాశముకోసం ఉదయము నుండి చూస్తున్నాను శ్రీలతా. కాదనకు శంఖంలాంటి నీమెడకు ఇది .... ఈ శంఖుల హారం యెంతో బావుంటుంది."

"ఎవరయినా చూస్తే...."

"నేను దురుద్దేశంతో ఇవ్వటం లేదు,

## డిగ్రీ తరగతులలో బోధనా భాషగా తెలుగు అమలు

హైదరాబాద్, జూన్ 29: ఆంధ్ర ప్రదేశ్‌లో 1971-72 విద్యా సంవత్సరము నుంచి డిగ్రీ తరగతులలో తెలుగు బోధనా భాషగా వుంటుంది. అయితే యింగ్లీషు




సౌందర్యాన్ని ఆరాధించడము తప్పా! ప్లీజ్ నా తృప్తికోసం '' అక్కడుండ లేక పోయాను. గది యెలా చేరానో, నాకే తెలియదు. హృదయము కుత, కుత లాడుతుంది. సౌందర్యాన్ని ఆరాధించటం తప్పుకాదు, కాని నా కళ్ళ ముందే నా భర్త, నాకు చిన్నతనము నుండి ప్రత్యర్థిగా నిలచిన అక్కను ఆరాధించటమా! అది అక్కకాదు, నా దాయాది! నాపాలిట శని! కసిగా పళ్ల కొరికాను వారిద్దరూ గదిలో నిలబడిన తీరు ఈ జన్మలో కాదు. మరో జన్మలో మరిచి పోలేను. మరిచి పోలేను. మరిచి అతనితో కాపురం చెయ్యటానికి నాలో గుండె వుంది కాని రాయిలేదు.

అందరికి కవ్వించే బాహ్యరూపం లేదా వున్నా. స్పర్శ, హృదయము, ఆశలు, అనుభూతులు అందరిలాంటివే కన్నవారు నాజన్మకు జీవితాంతంఏడ్చారు. తోబుట్టువులు నా ఉనికిని అసహ్యించుకున్నారు. చేసుకున్నవాడు.... ఈ అవమానము చాలు. రేపు పిల్లలు పుడితే! ఆయనలా పుడితే నన్ను అసహ్యించుకుంటారు. నాలా పుడితే? ఏముంది నాలానే నరకయాతన అనుభవిస్తారు. ఇంతకంటే ...నేను ఈ లోకంనుండి వెళ్ళిపోవటమే ఉత్తమమైన మార్గము! ఓ నిర్ణయానికి వచ్చాను. నాన్నకు 'మైగ్రేన్' ఉంది. నొప్పివచ్చినప్పుడు మాత్ర వేసుకుని నిదురపొమ్మని డాక్టరు నిదర మాత్రలు యిచ్చాడు. నాన్న గదిలోకి వెళ్ళి సీసా తీసుకుని వస్తూ హాల్లోకి

తొంగి చూచాను. తమ్ముడు, వాళ్లు ముగ్గురూ పేక ఆడుతున్నారు. నా దృష్టి అక్కయ్య మెడలో నిలిచి పోయింది. ఆమె మరిదిగారు ప్రేమతో బహూకరించిన హారం వేసుకుంది. నాకు హారం రాచుకున్నట్టు అయింది. వాళ్ళాయన ముందుపరువు తీయాలి. నెమ్మదిగా వెళ్లి అక్కడ కూర్చున్నాను.

"అక్కయ్యా! హారం చాలా బావుందే! యెక్కడిది?"

"ఉండవే.... సీక్వెన్స్ కలవక వస్తుంటే..." అని కార్డు తీసుకుని, నా వైపు తిరిగింది.

"ఓ స్నేహితురాలు యిచ్చింది."

యెంత నటన! క్రీగంట మావారి వైపు చూచాను. ఆదుర్దాగా మా ఇద్దరినే గమనిస్తున్నాడు. చర, చరా అక్కడి నుండి వచ్చాను. ప్రతి నిముషం నాకు ప్రత్యర్థిగా నిలచిన అక్కయ్య బ్రతకాలెందుకు నేను చావడం దేనికి! ఆ క్షణంలో అసూయా, ద్వేషం, కసి నా అణువణువు జ్వలనం చెయ్యసాగింది. మంచీ, చెడూ ఆలోచించే శక్తిని కోల్పోయాను. కర్తవ్యం ఆలోచిస్తూ క్రింది పెదవు కొరుకుతూ నిల్చున్నాను.

"జయలక్ష్మీ!" అమ్మ కేక విని వంట ఇంట్లోకి వెళ్ళాను. మినపసున్ని ఉండలు కడుతుంది

"నా చెయ్యి ఖాళీగా లేదు. వాళ్ళకు టీ కావాలట. కలిపి పెట్టవూ!" యెంత మంచి అవకాశము! నాలోని రాక్షసత్వము ఒక్కుమ్మడిగా పైకి లేచింది. అక్కయ్యకు ఇవ్వబోయే కప్పులో ఒకొక్క నిదురమాత్రే జార విడిచాను. గుర్తుగా స్పూను పెట్టాను. అందరికి టీ ఇస్తుంటే చేతులు వణికాయి. అక్కడ ఉండలేక పోయాను.

"ఇది టీ పెడితే స్ట్రాంగుగా పెడుతుంది."

"బాగానే ఉందే." బావగారి మాటలు.

"నాకు చేదుగా ఉంది. ఒరేయ్ ఒక చెంచాడు పంచదార పట్రారా!" అక్కయ్య తమ్ముడితో అంటుంది. అరగంట తరువాత అక్కయ్య గదిలోకి రావటం చూచాను.

"దినమంతా తిరుగుడు. రాత్రి పేక. తల తిరగదూ!" అమ్మ సనుగుడు వినిపించింది.

"పడుకోనివ్వు. రేపు ప్రయాణం పెట్టుకున్నారు." నాన్న మాటలు వినిపించాయి.

వారికేం తెలుసు, కొద్ది సేపట్లో అక్కయ్య శాశ్వత నిద్రపోతుందని! అక్కయ్య కొత్త సంసారానికి సర్దుకున్న సరంజామా చూచి పక్కున నవ్వాలనిపించింది. పిచ్చిగా గంతులు వేయాలనిపించింది. అందరూ భోజనాలు చేశారు. నేను చెయ్యలేకపోయాను. నాలోని మానవత్వము మెల్లగా, అతి మెల్లగా మేల్కొంది.

ఆలోచనలు సాగిపోతున్నాయి. తప్పు నాదా? పదే, పదే ప్రశ్నించుకున్నాను. జవాబు లేదు. కట కటాల వెనుక హాయిగా ప్రశాంతంగా ఉంది.

''జయా!'

తలెత్తాను. కట కటాల కవతల సుగుణమ్మ నిలబడి ఉంది. ఆ అమృత మూర్తికి ముఖం యెలా చూపను?

' జయా!''

''టీచర్!'' కట కటాలను పట్టుకు నిల్చున్నాను. నా కళ్లమ్మటి నీళ్ళు రావటం లేదు.

''యెంతపని చేశావు జయా!'

''అవును టీచర్ ఆక్షణంలో నేను ఏం ఆలోచించ లేదు. అక్కయ్యను చంపింది నేనేనని పోలీసులకు చెప్పాను. నాకు ఉరి శిక్ష వేస్తారు.''

''వద్దు జయా. అంతమాటనకు.''

''నిజం టీచర్! మీరు పూజ చేస్తారు. ఏదీ ఆభగవంతుడు! అతనుకనిపిస్తే ఒకే ఒక ప్రశ్న అడగాలని ఉంది టీచర్: కురూపిగా పుట్టడం నాతప్పా? మీరయినా చెప్పండి టీచర్?'' అన్నాను ఆవేశంగా.

''ఏం చెప్పను! మీ నాన్నగారు లాయకును పెడతారట ...''

''యెందుకూ!'' నవ్వాను. ఆయనతో చెప్పండి. వారిలో ఏపాటి సహృదయత మిగిలినా నన్నిలా వదిలేయమనండి. అక్కయ్యకు నాకు భేదాభిప్రాయాలు కలుగ జేసిందే ఈ తల్లి తండ్రులు! వారే ఈ అనర్థాలన్నింటికి కారణం! తమ సంతానాన్ని ఒకే దృష్టితో చూచే తల్లితండ్రుల వద్ద పిల్లలు ప్రేమాభిమానాలు నేర్చుకుంటారు ...''

''జయా! తప్పెవరి దయినాగాని విమర్శించే అధికారం నీకు లేదు.''

''అవును. వారు నాకు జన్మనిచ్చారు. అదిలా సార్థకం అయింది.'' వేలవంగా నవ్వాను. యెటు చూచినా శ్రీలతే కన్పిస్తుంది. భారంగా సుగుణమ్మ టీచర్ కదిలింది.

''టీచర్!''

''ఏమిటమ్మా?''

''మీరయినా మీ సంతానాన్ని సమంగా చూడండి. వారిమధ్య అసూయా ద్వేషాలు రగల్చకండి. నా ప్రార్థన....'' అన్నాను. ఆమాట అనేటప్పుడు అప్రయత్నంగా కన్నీరు రాలింది. ఆమె జాలిగా నావైపు చూచి సాగి పోయింది. నేను కోర్టు తీర్పుకై వేచి యున్నాను.

